క్లుప్తంగా

క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న హరిబాబు

మాకవరపాలెం: పి.పి.అగ్రహారంలో మండల స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను తూర్పుకాపు సంఘం మండలాధ్యక్షుడు గొంతిన హరిబాబు శనివారం ప్రారంభించారు. ముందుగా పోటీల్లో పాల్గొనేందుకు హాజరైన జట్లను ఆయన పరిచయం చేసుకున్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన జట్లకు ప్రథమ, ద్వితీయ బహుమతులుగా రూ.45 వేలు, రూ.25 వేలు అందజేస్తామని నిర్వాహకుడు శ్రీకాంత్ తెలిపారు.

సూదివలసలో ఉపాధి పనులు ప్రారంభం



ఉపాధి పనులను ప్రారంభిస్తున్న ఎంపీటీసీ రామునాయుడు

కె.కోటపాడు: జాబ్ కార్డుదారులకు వంద రోజుల పనిదినాలను ప్రభుత్వం కల్పిస్తున్నట్లు ఎంపీటీసీ వర్రి రామునాయుడు తెలిపారు. సూదివలసలోని మొల్లివాని చెరువులో ఉపాధి పనులను శనివారం ఆయన ప్రారంభించారు. ఇక్కడ చెరువులో పూడికతీత, గట్టు పటిష్టత పనులకు రూ.7.50 లక్షలు మంజూరైనట్లు వీఆర్పీ సాయి తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వర్రి కొండబాబు, వైఎస్సార్‌సీపీ నాయకుడు కిలపర్తి సత్యంనాయుడు పాల్గొన్నారు.

కృష్ణదేవిపేట ఎస్‌ఐగా ఉపేంద్ర



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్‌ఐ ఉపేంద్ర

గొలుగొండ: కృష్ణదేవిపేట పోలీస్ స్టేషన్ ఎస్‌ఐగా ఉపేంద్ర శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎస్‌ఐ సూర్యనారాయణ చోడవరం బదిలీ అయ్యారు. అచ్యుతాపురంలో పనిచేస్తున్న ఎస్‌ఐ ఉపేంద్రను ఇక్కడకు ఉన్నతాధికారులు బదిలీ చేశారు. ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉంటూ పారదర్శకంగా సేవలందిస్తానని ఎస్‌ఐ తెలిపారు.

ఇద్దరు పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్

మాకవరపాలెం: పింఛను నగదు చోరీ ఘటనకు సంబంధించి ఇద్దరు కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేశామని ఎంపీడీవో అరుణశ్రీ తెలిపారు. శెట్టిపాలెం సచివాలయ పరిధిలో పింఛన్లు పంపిణీ చేసేందుకు తీసుకెళుతున్న రూ.16.15 లక్షలు ఈ నెల 3న గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకుపోయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో శెట్టిపాలెం సచివాలయ కార్యదర్శి రాజారావు, వెల్ఫేర్ అసిస్టెంట్‌గా వ్యవహరిస్తున్న జడ్.గంగవరం కార్యదర్శి నవ్యశ్రీలకు శాఖాపరంగా షోకాజ్ నోటీసులు జారీ చేశామన్నారు. మరోవైపు నవ్యశ్రీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

జాలంపల్లిలో ఫ్యామిలీ డాక్టర్ సేవలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి మాలెంనాయుడు

మాడుగుల: ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమంలో భాగంగా శనివారం జాలంపల్లిలో 20 మంది గర్భిణులను, 30 మంది మధుమేహ వ్యాధిగ్రస్తులను వైద్యాధికారి మాలెంనాయుడు పరీక్షించారు. మరో 40 మంది సాధారణ రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. సర్పంచ్ ధారా మల్లేశ్వరి, హెల్త్ సూపర్‌వైజర్ ప్రసాద్, హెల్త్ అసిస్టెంట్ సీతారాజు, సిబ్బంది వసంత, గంగాధర్ పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో వెలుగు

- మున్సిపల్ చైర్‌పర్సన్ ఆదిలక్ష్మి



నర్సీపట్నం: ప్రభుత్వ పాలన గురించి వివరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆదిలక్ష్మి



కె.కోటపాడు: సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు అనురాధ



రోలుగుంట: కిట్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ కాంతమ్మ, నాయకుడు రాజారావు

నర్సీపట్నం: సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పలు సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టి పేదల జీవితాల్లో వెలుగులు నింపారని మున్సిపల్ చైర్‌పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి అన్నారు. శనివారం ఆమె పట్టణంలోని 17వ వార్డు బలిఘట్టంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ కన్వీనర్, గృహసారథులతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించి, మా నమ్మకం నువ్వే జగన్ స్టికర్‌ను అతికించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ప్రజారంజక పాలనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారన్నారు. ప్రజాభిప్రాయాన్ని తెలుసుకునేందుకు తాము ఇంటింటికీ వస్తున్నట్లు వివరించారు. నిజాయితీ, విలువలతో కూడిన నాయకుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని, పారదర్శక పాలన అందిస్తున్నారని ప్రశంసించారు.

వివక్ష లేని ప్రజా సంక్షేమ పాలన

కె.కోటపాడు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమం, గత చంద్రబాబు పాలనలో ప్రజలు పడిన ఇబ్బందులను వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఈర్లె అనురాధ వివరించారు. శనివారం ఆమె ఎ.భీమవరంలో సర్పంచ్ తగ్గా సన్యాసమ్మ, గృహసారథులు, సచివాలయ కన్వీనర్, వలంటీర్లతో కలిసి ఇంటింటికి వెళ్లారు. వివక్ష లేకుండా సీఎం జగన్ అందిస్తున్న సంక్షేమ పాలనను వివరించారు. పార్టీ నాయకులు తగ్గా శేషు, తగ్గా మోహన్‌రావు, చందు పాల్గొన్నారు.

నాతవరం: జగనన్నే మా భవిష్యత్తు ద్వారా ప్రతి ఇంటికి స్వయంగా వెళ్లి మనం చేసే పనులు చెప్పుకోవడానికి చక్కటి అవకాశమని వైస్ ఎంపీపీ మైనం శ్రీనాగగోపి తెలిపారు. చమ్మచింత పంచాయతీలో శనివారం ఆయన ఇంటింటికీ వెళ్లి వివరించారు. ప్రతిపక్ష పార్టీలు చెబుతున్న కల్లబొల్లి మాటలు నమ్మొద్దని కోరారు. సర్పంచ్ వెలకాడ కొండబాబు, ఉప సర్పంచ్ అప్పన దివాణం, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

మాడుగుల: జమ్మాదేవిపేటలో వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, సర్పంచ్ కొసిరెడ్డి కృష్ణమూర్తి, సచివాలయ కన్వీనర్లు దుడ్డు రాజుకుమార్, మట్టా అమ్మాజీల ఆధ్వర్యంలో శనివారం ఇంటింటికి తిరిగారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి వివరించారు. గాదిరాయిలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు పత్రే రామునాయుడు, సచివాలయ కన్వీనర్ పత్రే రమణ, నాయకుడు సలాది అచ్చంనాయుడు పాల్గొన్నారు.

మాడుగులలో.. ఎంపీపీ వేమవరపు రామధర్మజ, సచివాలయ మండల కన్వీనర్ బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, సర్పంచ్ ఎడ్ల కళావతి, ఉప సర్పంచ్ శ్రీనాథు శ్రీనివాసరావు, ఎంపీటీసీలు, పాలిమేర విజయలక్ష్మి, కుక్కర మహేశ్వరి, కోఆప్షన్ మెంబరు షేక్ ఉన్నీషా బేగం ఇంటింటికీ తిరిగారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో కలిసి అవగాహన కల్పించారు. అవురువాడ వీరణారాయణంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

మాడుగుల రూరల్: జగనన్న మా భవిష్యత్తు కార్యక్రమాన్ని శనివారం పోతనపూడి అగ్రహారంలో నిర్వహించారు. వైస్ ఎంపీపీ కొత్తపల్లి శ్రీనివాసరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కోరుకొండ చెల్లంనాయుడు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ, అభివృద్ధిని వివరించారు. ముచ్చకర్ల రాము, కోరుకొండ సత్తిబాబు, మెలిపాక పైడినాయుడు, పడాల నాని, ధర్మిశెట్టి మహేష్, జగడాల నారాయణరావు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

గృహసారథులకు కిట్లు పంపిణీ

రోలుగుంట: కొవ్వూరులో గృహసారథులకు సర్పంచ్ యర్రంశెట్టి కాంతమ్మ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు రాజారావు కిట్లను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంతమ్మ మాట్లాడుతూ ప్రజలతో మమేకమై వారి సమస్యల పరిష్కార మార్గం చూపించడంపై అవగాహన కల్పించారు.

దేవరాపల్లి: రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్న సీఎం వైఎస్. జగన్‌మోహన్ రెడ్డిపై ప్రజలు అపార విశ్వాసంతో ఉన్నారని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు తెలిపారు. శనివారం కాశీపురం, ముషిడిపల్లి, నాగయ్యపేట గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని జేసీఎస్ మండల కన్వీనర్ కె.వి.రమణతో కలిసి ఆయన నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం మండల అధ్యక్షురాలు రొంగలి నారాయణమ్మ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

గొలుగొండ: మండలంలోని 20 గ్రామ సచివాలయాల పరిధిలో శనివారం జగనన్న మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. గృహసారథులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వలంటీర్లు ప్రతీ ఇంటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు గురించి ప్రజలకు వివరించారు. వారి అభిప్రాయాలను సేకరించారు.

రోలుగుంట: నిండుగొండలో సర్పంచ్ శెట్టి సంధ్య, మాజీ ఎంపీపీ శెట్టి సత్యనారాయణమూర్తి ఇంటింటా తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకుంటున్నారు. నవరత్నాలతో అన్ని వర్గాల వారికి కలిగిన మేలు గురించి వివరించారు. మాజీ ఎంపీటీసీ వై.వెంకటరాజారావు, దారపురెడ్డి నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



మాడుగుల: జేడీపేటలో కరపత్రాలు అందిస్తున్న వైస్ ఎంపీపీ రాజారామ్, సర్పంచ్ కృష్ణమూర్తి



బుచ్చెయ్యపేట: వడ్డాదిలో స్టిక్కర్లు ప్రదర్శిస్తున్న నాయకుల



నర్సీపట్నం: స్టిక్కర్ అతికిస్తున్న ఎంపీపీ రాజేశ్వరి

నర్సీపట్నం: యరన్నపాలెంలో శనివారం నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో ఎంపీపీ సుర్ల రాజేశ్వరి పాల్గొన్నారు. సచివాలయ కన్వీనర్, గృహసారథులు, వలంటీర్లతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని వివరించారు. జగనన్న స్టిక్కర్లను ఇంటింటికీ అతికించారు. పార్టీ మండలాధ్యక్షుడు సుర్ల సత్యనారాయణ, సర్పంచ్ నారాయణమ్మ, వైస్ సర్పంచ్ సుర్ల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట: మండలంలోని చింతపాక, వడ్డాదిలో జెడ్పీటీసీ దొండా రాంబాబు, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, పార్టీ వడ్డాది టౌన్ అధ్యక్షుడు దొండా నారాయణమూర్తి, మండల సచివాలయ కన్వీనర్ కోరుకొండ అప్పలనాయుడు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు, కోఆపరేటివ్ అధ్యక్షుడు దొండా సన్యాసిరావు ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం చేబడుతున్న సంక్షేమ లబ్ధిని ప్రజలకు వివరించారు. సర్పంచ్‌లు కోరుకొండ కామలక్ష్మి, గొలజాన శ్రీను నాయకులు కుబిరెడ్డి వెంకటరావు, వీర్ల సురేష్, బేతి వరలక్ష్మి, పాలిమేర కృష్ణ, కోరుకొండ రమణ, శంకర్రావు, మునలినాయుడు, రవి పాల్గొన్నారు.



నాగయ్యపేటలో కరపత్రాన్ని అందజేస్తున్న బూరె బాబూరావు, రమణ



గొలుగొండ: పుత్తడిగైరంపేటలో కార్యక్రమం



నాతవరం: సంక్షేమ పథకాలపై వివరిస్తున్న వైస్ ఎంపీపీ మైనం శ్రీనాగగోపి



మాడుగుల రూరల్: పోతనపూడిలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న నాయకులు

డ్వాక్రా మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



మాట్లాడుతున్న ఏపీఎం వెంకటలక్ష్మి

కె.కోటపాడు: మూడు విడతల వైఎస్సార్ ఆసరా పథకంతో మండలంలోని 15,246 మంది డ్వాక్రా సభ్యుల ఖాతాల్లో రూ.32.80 కోట్లు జమ అయినట్లు జెడ్పీటీసీ ఈర్లె అనురాధ తెలిపారు. మహిళా సమాఖ్య మండలాధ్యక్షురాలు బొడ్డు జయలక్ష్మి అధ్యక్షతన శనివారం స్థానిక వెలుగు కార్యాలయంలో మండల మహిళా సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ ఆసరా పథకంతో డ్వాక్రా మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. ఏపీఎం వెంకటలక్ష్మి మాట్లాడుతు ప్రతి నెలా గ్రామ సంఘం ఆధ్వర్యంలో సమావేశాలను నిర్వహించాలని తెలిపారు. ప్రతి నెలా బ్యాంక్ లింకేజీ రుణాలు, పొదుపు నగదును సకాలంలో బ్యాంకులకు చెల్లించాలని వివరించారు. కార్యక్రమంలో సీసీలు వెంకటరావు, సూర్యనారాయణ, సన్యాసిరావు, సీతంనాయుడు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పది పబ్లిక్ పరీక్షలు

మాడుగుల రూరల్: పోలీసుల నిఘా నీడలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. మూడో రోజు శనివారం ఇంగ్లిష్ పరీక్ష నిర్వహించారు. మండలంలోని ఐదు పరీక్ష కేంద్రాల్లో 732 మంది విద్యార్థులకుగాను 725 మంది హాజరైనట్లు ఎంఈవో బి. దేముడమ్మ తెలిపారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం నేడు

దేవరాపల్లి: అమ్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం చింతలపూడి పంచాయతీ సమ్మెదలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు సర్పంచ్ దొమ్మంగి బోడెమ్మ, ట్రస్టు చైర్మన్ గొంప వెంకటరావు తెలిపారు. ఇక్కడ ప్రభుత్వ స్కూల్ ఆవరణలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిబిరం నిర్వహిస్తామన్నారు. శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి వైద్య సిబ్బంది రోగులను పరీక్షిస్తారన్నారు.

చీడికాడ ఎస్‌ఐగా రామారావు



ఎస్‌ఐ రామారావు

చీడికాడ: స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎస్‌ఐగా పి.రామారావు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎస్‌ఐగా విధులు నిర్వహించిన సుధాకరరావు అనకాపల్లి జిల్లా ఎస్పీ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో విశాఖ క్రైం బ్రాంచ్‌లో పనిచేసిన పి.రామారావు ఇక్కడకు వచ్చారు.

చిన్నారులకు వ్యాధినిరోధక టీకాలు



పౌష్టికాహారం అమలుతీరుపై చిన్నారులను అడిగి తెలుసుకుంటున్న ఎంపీటీసీ విజయలక్ష్మి

కె.కోటపాడు: గర్భిణులు ఆరోగ్యంగా ఉండేందుకు వైద్య సిబ్బంది ఇచ్చే ఆరోగ్య జాగ్రత్తలను పాటించాలని చౌడువాడ పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ డి.ఎస్.ఎన్.రాజు, హెచ్.వి సన్యాసమ్మ తెలిపారు. రొంగలినాయుడుపాలెంలో గర్భిణులకు, బాలింతలకు శనివారం ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు. అనంతరం 0-5 ఏళ్లలోపు 19 మంది చిన్నారులకు వ్యాధినిరోధక టీకాలతోపాటు ఎనిమిది మంది గర్భిణులకు ధనుర్వాతం నివారణ టీకాలు వేశారు. ఎంఎల్‌హెచ్‌పి సంతోషి పాల్గొన్నారు.

మాడుగుల: స్థానిక అంగన్వాడీ కేంద్రం -2లో వైఎస్సార్ పౌష్టికాహార కిట్లను ఎంపీటీసీ సభ్యురాలు పాలిమేర విజయలక్ష్మి శనివారం పంపిణీ చేశారు. అనంతరం కేంద్రంలో అందిస్తున్న గుడ్లు, పాలు, అన్నం, ఎలా అందుతున్నాయని చిన్నారులను అడిగి తెలుసుకున్నారు.

ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు

- అడ్డూరులో గ్రామ సచివాలయ భవనం ప్రారంభోత్సవంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: ప్రభుత్వ పథకాలు అందరికీ అందేలా గ్రామ స్థాయిలో సచివాలయ వ్యవస్థను తెచ్చి ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలను చేరువ చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. అడ్డూరులో రూ. 45 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ గతంలో ఏ పని కావాలన్నా మండల కేంద్రానికి వెళ్లి కార్యాలయాల చుట్టూ రోజుల తరబడి తిరగాల్సి వచ్చేదని వాపోయారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక అన్ని శాఖలు కలిసి ఉన్న గ్రామ సచివాలయ వ్యవస్థను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాలకే తీసుకొచ్చారన్నారు. అంతేకాకుండా ప్రభుత్వం అదిస్తున్న సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారుని ఇంటింటికీ వెళ్లి అందించేందుకు సచివాలయం, వలంటీర్ల వ్యవస్థను ప్రవేశ పెట్టారన్నారు. అర్హతే కొలమానంగా పార్టీలకతీతంగా ప్రజలందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తున్నామన్నారు. గ్రామంలో పలు సమస్యలను స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు నాగిరెడ్డి సత్యనారాయణ, శరగడం చిమ్మినాయుడు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. వాటి పరిష్కారానికి నిధులు మంజూరు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. పూర్తిస్థాయిలో సచివాలయ సిబ్బంది కార్యాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ప్రభుత్వ సేవలన్నీ ఎటువంటి జాప్యం లేకుండా సకాలంలో చేయాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, ఎంపీపీ గాడి కాసు అప్పారావు, తహసీల్దార్ తిరుమలబాబు, ఎంపీడీవో చైతన్య, పంచాయతీ డీఈఈ ప్రసాద్, హౌసింగ్ ఏఈ రమణమూర్తి, వైస్ ఎంపీపీలు బైన ఈశ్వరరావు, బుద్ద గంగరాజు, సర్పంచ్‌ల మండలాధ్యక్షుడు దొడ్డి వెంకట్రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

మాడుగులలో అభివృద్ధి పనుల పరిశీలన



సీసీరోడ్డు పరిశీలిస్తున్న ఓఎస్‌డీ పోలినాయుడు ఎంపీపీ రామధర్మజ

మాడుగుల: డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు చొరవతో రూ.90 లక్షలతో ఆర్‌అండ్‌బీ బంగ్లా పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ పనులను ఓఎస్‌డీ ఎం.పోలినాయుడు, ఎంపీపీ వేమవరపు రామధర్మజ, సచివాలయ కన్వీనర్ బొమ్మిశెట్టి శ్రీనివాసరావు శనివారం పరిశీలించారు. మరో మూడు, నాలుగు నెలల్లో పూర్తి చేసి ప్రారంభిస్తామని పీఆర్ డీఈ రమణ తెలిపారు. స్థానిక హైస్కూల్ కాలనీలో రూ.1.4 కోట్లతో సీసీరోడ్లతోపాటు డ్రైనేజీ పనులు పరిశీలించారు. సర్పంచ్ ఎడ్ల కళావతి, ఉప సర్పంచ్ శ్రీనాథు శ్రీనివాసరావు, నాయకుడు ఎడ్ల హేమంత్‌కుమార్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న డైరెక్టర్ సత్యనారాయణ

బుచ్చెయ్యపేట: కొమళ్లపూడిలో అభివృద్ధి పనులను విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ శనివారం ప్రారంభించారు. ఇటీవల ఇక్కడ గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ నిర్వహించారు. ఆ సమయంలో కాలువలు, ఇతర అభివృద్ధి పనులు చేయాలని గ్రామస్తులు కోరారు. దాంతో రూ. 20 లక్షలు మంజూరు చేయించారు.

గిరిజన ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా ధనార్జన్



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

నర్సీపట్నం: గిరిజన ఉద్యోగుల సంఘం నర్సీపట్నం శాఖ అధ్యక్షుడిగా ధనార్జన్‌ను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం స్థానిక ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఉద్యోగుల సంఘ సమావేశం జరిగింది. నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శులుగా జె.సింహాచలం, ఎస్.ధర్మరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా జానకాని కృష్ణయ్య, కూడా లక్ష్మణరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా వంతుల బాబు, ఎస్.కోటిబాబు, కోశాధికారి ఎస్.భరత్ కుమార్, వైస్ ప్రెసిడెంట్లుగా కె.నాగమణి, ఎస్.శ్రావణ్‌కుమార్, జాయింట్ సెక్రటరీగా అచ్చియ్యమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా పోతురాజు, నారాయణరావు, అప్పారావు, సోమయ్య, రామారావు వ్యవహరించారు.

సీబీసీఐడీకి మృతి కేసు అప్పగించాలని డిమాండ్



నిరసన వ్యక్తం చేస్తున్న మృతుడి కుటుంబీకులు, నాయకులు

దేవరాపల్లి: జామి సింహాచలం నాయుడు కేసు విచారణను సీబీసీఐడీకి అప్పగించాలని మృతుడి కుటుంబీకులు, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక రైవాడ అతిథి గృహం ఆవరణలో శనివారం వారు ప్లకార్డులు ప్రదర్శించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి. వెంకన్న మాట్లాడుతూ ఈ కేసు విచారణలో మొదటి నుంచి పోలీస్‌లు తీరుపై పలు అనుమానాలు ఉన్నాయన్నారు. మృతికి సంబంధించి ఇప్పటికే 25 మంది సాక్షులు స్టేట్‌మెంట్ ఇచ్చినా, ఇంకా సాక్షాలు తీసుకురావాలని పోలీసులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేసే వరకు పోరాటం ఉధృతం చేస్తామన్నారు. మృతుడి తల్లి సింహాచలం త్వరలో పోలీస్ స్టేషన్ ఎదుట నిరాహార దీక్ష చేపట్టనుందని హెచ్చరించారు. గవిరెడ్డి దేముడునాయుడు, బండారు అప్పలనాయుడు, జామి శ్రీను, చొక్కాకుల దేముళ్లు, సిహెచ్. రామునాయుడు, బి.టి. దొర పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో ఖాళీల భర్తీకి దరఖాస్తులు



మాట్లాడుతున్న సీడీపీవో శ్రీగౌరి

నాతవరం: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గొలుగొండ ఐసీడీఎస్ ప్రాజక్టు సీడీపీవో కె. శ్రీగౌరి శనివారం తెలిపారు. నాతవరం అంగన్‌వాడీ కేంద్రం-3లో ఆయా పోస్టు (ఎస్సీ), గుమ్మడిగొండ పంచాయతీ శివారు చిక్కుడుపాలెం కేంద్రంలో ఆయా పోస్టు (ఓసీ), లింగంపేట పంచాయతీ శివారు బుచ్చెంపేటలో ఆయా పోస్టు (బీసీ- ఏ) నియామకానికి ఈ నెల 10 నుంచి 17వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తులను తమ కార్యాలయానికి పోస్టల్ ద్వారా లేదా నేరుగా అందజేయాలన్నారు. 2022 జూలై 1 నాటికి అభ్యర్థుల వయస్సు 21 ఏళ్లు నిండి 35 ఏళ్ల లోపు ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 18 ఏళ్లు నిండి ఉండాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఎ.విజయలక్ష్మి, నాగజ్యోతి, సత్యశ్రీ పాల్గొన్నారు.

మాడుగుల రూరల్: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఒక అంగన్‌వాడీ కార్యకర్త, మూడు సహాయకుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీవో సీహెచ్ శ్రీదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తాటిపర్తి పంచాయతీ శివారు గరికబందలో అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు (బీసీ-డీ), ఆయా పోస్టు (ఓసీ), గదబూరులో ఆయా పోస్టు (ఓసీ), చీడికాడ మండలం ఖండివరం -2లో ఆయా పోస్టు (ఎస్సీ) అభ్యర్థులకు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఈ నెల 10 నుంచి 17వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తులను అందజేయాలన్నారు.

గౌరినాయుడు మృతి పార్టీకి తీరని లోటు

- నివాళులర్పించిన డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



గౌరినాయుడు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

కె.కోటపాడు: వి.సంతపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు లెక్కల గౌరినాయుడు (83) అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతి చెందారు. ఈ సమాచారం తెలుసుకున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మృతుడు భార్య సూర్యకాంతం, కుమారుడు శ్రీనివాసరావులను ఓదార్చారు. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి గ్రామంలో పార్టీ పటిష్టతకు గౌరినాయుడు కృషి చేశారన్నారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మాజీ సర్పంచ్ వేచలపు సింహాద్రప్పడు(చలం), లెక్కల దేముడునాయుడు, లెక్కల గోపి, గొంద్రుపోటు వెంకటరావు పాల్గొన్నారు.

ఎముకల సాంద్రతపై సదస్సు నేడు

అనకాపల్లిటౌన్ : వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక జార్జిక్లబ్‌లో ఆదివారం ఉదయం 7 గంటలకు కీళ్ల వ్యాధి నిపుణులు ఆళ్ల వసంతకుమార్‌తో ఎముకల సాంద్రతపై అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు క్లబ్ అధ్యక్షుడు యల్లపు శివ శనివారం పేర్కొన్నారు. క్లబ్ సభ్యులందరూ విధిగా హాజరుకావాలని ఆయన కోరారు.